క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



అయిజ: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన సందర్భంగా మంగళవారం బ్రైట్ స్టార్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న కిరణ్‌ను పాఠశాల యాజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఎస్తేర మాట్లాడారు. విద్యార్థి కిరణ్ ఇటీవల పాతపాలెంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారని తెలిపారు. డిసెంబర్ 23న నిర్వహించనున్న 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ –14 బాలుర విభాగం రాష్ట్ర స్థాయి ఖోఖో టోర్నమెంట్‌లో కిరణ్ పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు సాంకేతిక ప్రదర్శన

గద్వాల అర్బన్: మండలంలో గోన్‌పాడులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగాలతో ఈనెల 21న సాంకేతిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రాంమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనలో ఆయా కళాశాలల నుంచి ఎంపిక చేసిన జట్లు పాల్గొంటాయని, సమీప పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు. జిల్లా స్థాయి సాంకేతిక ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన టీంలకు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

23న ఉత్తర ద్వార దర్శనం

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో వెలసిన శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 23న శనివారం వైకుంఠ ఏకదశి సందర్భంగా ఉత్తరద్వార స్వామివారి దర్శనం నిర్వహిస్తున్న మంగళవారం ఆలయ పెద్దలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 5గంటలకు అభిషేకం, భక్తుల నుంచి సేకరించిన బంగారు కిరీటం, బంగారు పాదాలు వినాయకుడి వెండి తొడుగు, అమ్మవారికి ఆభరణాలతో అలంకరణ, ఉదయం 6 గంటలకు స్వామివారి ఉత్తరద్వార దర్శనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజలు పాల్గొని దర్శనం చేసుకోవాలని వారు కోరారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో చదువుతున్న అర్హులైన ఎస్సీ విద్యార్థులు 2023–24 విద్యా సంవత్సరానికి పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారిణి శ్వేతాప్రియదర్శిని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రెష్, రెన్యూవల్ కోసం ఈనెల 31వ తేదీలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 2022–23సంవత్సరానికి సంబంధించిన పోస్టుమెట్రిక్ స్కాలర్‌పిప్‌ల హార్డ్‌కాపీలను ఈనెల 23వ తేదీలోగా జిల్లా కేంద్రంలోని షెడ్యూల్ కులాల ఆభివృద్ధి శాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

రోడ్డుకు మరమ్మతు చేయించండి



అయిజ: మండలంలోని చిన్న తాండ్రపాడు బీటీ రోడ్డు శిథిలమై సంవత్సరాలు గడుస్తున్నా కనీసం మరమ్మతుకు చేయడంలేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. గుంతలు పడిన రోడ్డుపై గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా మట్టి నివేసి రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు మంగళవారం గుంతలు పడిన రోడ్డుకు సుధాకర్‌గౌడ్ గ్రామస్తులతో కలిసి మట్టిని వేశాడు. ఇసుక టిప్పర్లు రోడ్డుపై తిరుగుతుండడంతో రోడ్డుపై మోకాలు లోతు గుంతలు ఏర్పడినాయని, అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డును పునర్ నిర్మించాలని గ్రామస్తులు కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందిస్తున్నామని, బడి మధ్యలో మానేసిన పిల్లలను పనులకు కాకుండా బడులకు పంపాలని ఎంఈఓ భాస్కర్‌సింగ్ అన్నారు. మంగళవారం ఆత్మకూర్ మండలంలోని పిన్నంచర్ల, బాలకిష్టాపూర్ గ్రామాల్లో బడి బయట పిల్లల సర్వే నిర్వహించారు, ఈసందర్భంగా సీఆర్పీ సౌమ్యరాణి ఇంటింటికీ వెళ్లి చిన్నారుల వివరాలను సేకరించారు. చదువు ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

ప్రధానరోడ్లపై ప్రమాదం

- కుంగిపోయిన మ్యాన్‌హోల్స్
- ప్రమాదాలకు గురవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



పాత పోలీస్ స్టేషన్ ముందు కుంగిన మ్యాన్‌హోల్

అయిజ: పట్టణంలో గతేడాది వివిధ కాలనీల్లో నిర్మించిన సీసీ రోడ్లపై నిర్మించిన మ్యాన్‌హోల్స్ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మిషన్ భగీరథకు సంబంధించిన రూ.2.5 కోట్ల నిధులతో గతేడాది సుమారు 3కి.మీ. సీసీ రోడ్లు నిర్మించారు. సీసీ రోడ్లపై మ్యాన్‌హోల్స్ నిర్మించారు. వాటిని నాసిరకంగా నిర్మించడంతో మ్యాన్ హోల్స్‌పై ఏర్పాటు చేసిన ప్లేట్లు భూమిలోకి కుంగిపోయాయి. దాని వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ప్రధాన రోడ్లపై పొంచి ఉన్న ప్రమాదాలు..

పాత పోలీస్‌స్టేషన్ ముందు టీ రోడ్డు మలుపు వద్ద మ్యాన్ హోల్ ఏర్పాటు చేయడంతో అది కుంగిపోయింది. దీంతో అక్కడ తరుచూ ప్రమాదాలు ఏర్పడుతున్నాయి. పశువుల ఆస్పత్రి నుంచి ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వరకు నిర్మించిన సీసీ రోడ్డుపై మ్యాన్ హోల్స్ ఏర్పాటు చేశారు. టీచర్స్ కాలనీలో మ్యాన్ హోల్ భూమిలోకి కుంగిపోయింది. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. భూమిలోకి కుంగిపోయిన మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేయాల్సి ఉంది.

మరమ్మతులు చేయిస్తాం..



సీసీ రోడ్లపై అక్కడక్కడ మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల భారీ వాహనాలు మ్యాన్ హోల్స్‌పై వెళ్లడంతో వాటిపై ఏర్పాటు చేసిన ప్లేట్లు భూమిలోకి కుంగిపోయాయి. కుంగిపోయిన మ్యాన్ హోల్స్ వద్ద ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. వీలైనంత త్వరగా మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేయిస్తాం.

– గోపాల్, మున్సిపల్ ఏఈ

ప్రమాదాలు జరుగుతున్నాయి..



యేడాది క్రితం మిషన్ భగీరథ కాంట్రాక్టర్లు నిర్మించిన సీసీ రోడ్డుపై మ్యాన్ హోల్స్ నాసిరకంగా నిర్మించడంతో మోటార్ సైకిళ్ల మ్యాన్ హోల్స్‌లో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. పాత పోలీస్‌స్టేషన్ ముందు రోడ్డు మలుపువద్ద మ్యాన్ హోల్ కుంగిపోవడంతో ఇప్పటికే అనేక సార్లు ప్రమాదాలు జరిగా యి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మ్యాన్ హోల్స్‌కు మరమ్మతులు చేయాలి.

– తిరుమలేష్, అయిజ

చర్యలు చేపట్టాలి..



సీసీ రోడ్లపై నాసికరంగా నిర్మించిన మ్యాన్‌హోల్స్ భూమిలోకి కుంగిపోయాయి. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేయించాలి. రాత్రి సమయంలో మ్యాన్ హోల్ కుంగినట్లు గమనించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు రోడ్లపై వెళ్తున్నారు కానీ పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి మ్యాన్ హోల్స్‌కు మరమ్మతులు చేపట్టాలి.

– తిరుమలరెడ్డి, అయిజ

సూచికలు ఏర్పాటు చేయాలి



కుంగిపోయిన మ్యాన్ హోల్స్ రాత్రి సమయంలో కనిపించడంలేదు. మ్యాన్ హోల్స్ చుట్టూ రేడియం స్టిక్కర్లు ఏర్పాట్లు చేయాలి. అవసరమైతే మ్యాన్ హోల్స్ చుట్టూ రాళ్లు పెట్టాలి. ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు చేపట్టాలి. వీలైనంత తొందరగా మ్యాన్ హోల్స్‌కు మరమ్మతులు చేపట్టాలి.

– మాదన్న, అయిజ

సమస్యలను పరిశీలించిన ఎమ్మెల్యే విజయుడు



రోడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజేయుడు

ఉండవెల్లి: మండల కేంద్రంలో శాలివాహన భవన నిర్మాణాన్ని ఎమ్మెల్యే విజయుడు మంగళవారం పరిశీలించారు. ఒకటో వార్డులో మురుగు నీరు నిల్వ ఉండడంతో రోడ్డును పరిశీలించారు. అంతకు ముందు వడ్ల శేఖరయ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గజేందర్ రెడ్డి, ఎంపీటీసీలు సుంకన్న, రాజశేఖర్, వైస్ చైర్మన్ అక్బర్ అలీ, నాయకులు లోకారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రవి, ర ఘురెడ్డి, కొండన్న, సుధాకర్ రెడ్డి, గోకారి, రామకోటిరెడ్డి, రాంబాబు, శ్రీనువాసులు, ఎక్బాల్, శ్రీ రాములు పాల్గొన్నారు.

నాగమల్లయ్యకు జ్యోతిష్య రత్న బిరుదు

మానవపాడు: మండలంలోని చెన్నిపాడుకు చెందిన నాగమల్లయ్యకు ఈ నెల 16, 17వ తేదీలో మధ్యప్రదేశ్ ఉజ్జయినిలో ఉన్న విక్రమ్ విశ్వవిద్యాలయంలో జరిగిన అంతరాష్ట్రీయ జ్యోతిష్య మహాసభల్లో నాగమల్లయ్య పాల్గొని విశ్వవిద్యాలయం వారిచే వాస్తు జ్యోతిష్య రత్న అనే బిరుదును పొందారు. ఈ బిరుదు చెన్నిపాడు గ్రామస్తునికి రావడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పాఠశాల విద్యార్థులకు షూ పంపిణీ



షూలు అందుకున్న విద్యార్థులు

అయిజ: వన్ ఫర్ వన్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు షూ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్‌దయాల్ మాట్లాడారు. క్రీడల పరంగా భారతదేశం అభివృద్ధి చెందాలంటే విద్యార్థులు క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో ఫుట్ ఫర్ ఆల్ అనే జర్మనీ సంస్థ ఫుట్‌బాల్ షూలను వన్ ఫర్ వన్ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా అందించడం హర్షించతగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో వన్‌ఫర్‌వన్ సంస్థ సభ్యుడు దేవేందర్, పాఠశాల పీఈటీ పరుశురాం, ఉపాధ్యాయులు భాస్కర్, తిమ్మప్ప, లక్ష్మన్న, రాజేశ్వర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వాడితే అధికలాభాలు

మల్దకల్: సేంద్రియ ఎరువుల వాడకం ద్వారానే రైతులు అధిక దిగుబడి పొందవచ్చని ఏఓ రాజశేఖర్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని అమరవాయి, సద్దలోనిపల్లి గ్రామాలలో సాగుచేసిన మిరుప పంటల ఆయన పరిశీలించారు. రైతులు ఏయేపంటలు సాగుచేశారు, సాగుచేసిన పంటల వివరాలు రికార్డులలో పొందుపరిచారా అని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడటం ద్వారా మంచి దిగుబడి పొందవచ్చన్నారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. రైతులు పండ్లతోటల సాగుపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ హారిక, పల్లవి రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను రూపొందించాలి



చాగదోణలో మాట్లాడుతున్న తహసీల్దార్

గట్టు: ఓటర్ జాబితాను తప్పుల్లేకుండా రూపొందించాలని బూత్ లెవల్ అధికారులను తహసీల్దార్ ధనుంజయ్ ఆదేశించారు. మంగళవారం చాగదోణ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో బూత్ లేవల్ అధికారులకు ఒక రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వచ్చే పంచాయతీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఓటర్ జాబితాను రూపొందించే అంశంపై మండల గణాంక అధికారి శ్రీనివాసులు ప్రోజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటర్‌గా నమోదు చేసుకునే విధంగా ఆయా పోలింగ్ బూత్‌ల పరిధిలోని కుటుంబాల వారికి తెలియజేయాలన్నారు. ఓటర్ జాబితాలో చనిపోయిన వారి పేర్లను ఫాం–7 ద్వారా తొలగించాలని, ఓటర్ జాబితాలో చిరునామా మార్పుకు ఫాం–8 ద్వారా పూర్తి చేయాలని కోరారు. డిసెంబర్ 20 నుంచి జనవరి 5 వరకు మార్పులు, చేర్పులకు అవకాశం ఉంటున్నట్లు తెలిపారు. ఓటర్ జాబితాను తప్పుల్లేకుండా రూపొందించేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గిర్దావర్లు కరీం, శ్రీనివాసులు, గణాంక అధికారి శ్రీనివాసులు, వివిధ గ్రామాలకు చెందిన బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

నర్సరీలలో బ్యాగులను పూర్తిగా నింపాలి



మానవపాడు: మండలంలోని చండూరు, పల్లెపాడు, బోరవెల్లి, జల్లాపురం గ్రామాల్లో నర్సరీలను ఎంపీడీఓ రమణారావు పరిశీలించారు. మంగళవారం ఆయా గ్రామాల్లోని నర్సరీలలో 10 వేల బ్యాగులను పక్కగా ఏర్పాటు చేయాలని, తగ్గించకుండా మట్టిని నింపాలని సూచించారు. కార్యక్రమంలో టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దుకాణాల కేటాయింపు వాయిదా



గ్రామ పంచాయతీలో మాట్లాడుతున్న కార్యదర్శి

గట్టు: గ్రామపంచాయతీ తీర్మానం లేకుండా, మినిట్స్‌లో పొందుపరచకుండా ఇది వరకే కేటాయించిన పంచాయతీ దుకాణాలకు మళ్లీ లక్కీ డిప్పు నిర్వహించడమేమిటని పంచాయతీ వార్డుసభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో దుకాణాల లక్కీ డిప్పు వాయిదా పడింది. మంగళవారం గట్టు గ్రామపంచాయతీకి సంబంధించి బస్టాండ్ ఆవరణలోని దుకాణాలకు లక్కీడిప్ ద్వారా కేటాయింపునకు సంబంధించి ఏర్పాట్లను చేశారు. ముందస్తుగా గ్రామంలో చాటింపు నిర్వహించారు. 11.30 గంటలకు ఎంపీఓ మహేష్, పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావు గ్రామంలో పంచాయతీలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పంచాయతీ భవనంలోకి చేరుకున్న ఎంపీటీసీ కృష్ణ, వార్డు సభ్యులు లక్కీ డిప్పు నిర్వహణపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఇది వరకు కేటాయించిన దుకాణాలను ఎప్పుడు రద్దు చేశారని, మళ్లీ ఎలా నిర్వహిస్తున్నారంటూ అధికారులను ప్రశ్నించారు. లక్కీ డిప్పులో పాల్గొనే వారు డీడీలను తీసుకుని రాకపోవడంతో కొంత సేపటి తర్వాత చేసేదేమి లేక లక్కీ డిప్పును వాయిదా వేస్తున్నట్లుగా ఎంపీఓ మహేష్, కార్యదర్శి జగన్నాథరావు తెలియజేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తనున్నట్లు వివరించారు.

తహసీల్దార్‌కు తప్పిన ప్రమాదం

గద్వాల క్రైం: నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ ముందు వెళ్తున్న కారును ఢీ కొట్టిన సంఘటనలో మల్దకల్ తహసీల్దార్‌కు ప్రమాదం తప్పింది. రూరల్ ఎస్ఐ ఆనంద్ కథనం మేరకు.. మల్దకల్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న హరికృష్ణ మంగళవారం విధులు ముగించుకొని కారులో గద్వాలకు వెళ్తున్నాడు. అయిజ నుంచి గద్వాల వైపు వస్తున్న డీసీఎం పరుమాల స్టేజీ సమీపంలో తహసీల్దార్ కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు వెనుక భాగం దెబ్బతినగా, కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం కాలేదు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్ సతీష్, యాజమాని హమ్మిన్‌సాబ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పాఠశాలను పరిశీలించిన ఎంఈఓ



మానవపాడు: మండలంలోని పల్లెపాడు, చండూరు ప్రైమరీ పాఠశాలలను ఎంఈఓ శివప్రసాద్ పరిశీలించారు. మంగళవారం చండూరు ప్రైమరీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ ధనుంజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడులకు పంపించాలి

పాన్‌గల్: బడిఈడు కలిగిన పిల్లలను పనులకు కాకుండా బడులకు పంపించాలని మండల సీఆర్పీలు తల్లిదండ్రులకు సూచించారు. మంగళవారం మండలంలోని కేతేపల్లి గ్రామంలో బడిమానేసి ఇంటి పనులు చేస్తున్న విద్యార్థుల వివరాలను తెలుసుకొని వారి ఇండ్లకు వెళ్ళి విద్య యొక్క ప్రాధాన్యత, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్నబోజనం, నాణ్యమై న విద్య అందిస్తున్నట్లు తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించి ప్రభుత్వ బడుల బలోపేతానికి తోడ్పాటునందించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు గోవింద్‌నాయక్, రమాదేవి, భార్గవి పాల్గొన్నారు.

శివస్వాముల పాదయాత్ర



గట్టు: మండలంలోని మాచర్లకు చెందిన శివస్వాములు మంగళవారం పాదయాత్ర చేపట్టారు. గ్రామంలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇరుముడులు ధరించి, గ్రామం నుంచి శ్రీశైలానికి పాదయాత్ర ప్రారంభించారు. గ్రామస్తులు శివస్వాములకు మంగళహారతులు ఇచ్చి, ఊరేగింపు నిర్వహించి సాగనంపారు.

ఈదమ్మ, మైసమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

కేటీదొడ్డి: మండలంలోని మల్లాపురంతండాలోని ఈదమ్మ, మైసమ్మ జాతర సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రాజశేఖర్, వైస్ఎంపీపీ రామకృష్ణనాయుడు, మండల అధ్యక్షుడు ఉరుకుందు, సర్పంచు ఆంజనేయులు, సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితం



ధరూరులో గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యులు

మల్దకల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితమని డాక్టర్ స్వరూపరాణి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణీ, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు నెలనెలా క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవడంతో పాటు పోషకాలు ఎక్కువగా ఉండే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ధరూరు: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గర్భిణులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. గద్వాలకు చెందిన ఓ ప్రైవేట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచితంగా స్కానింగ్ చేయడంతో పాటు మందులను పంపిణీ చేశారు. స్త్రీ వ్యాధి సమస్యలు, సంతానలేమీ తదితర సమస్యలపై డాక్టర్ ప్రియాంక పరీక్షలు చేశారు.

వంతెన ప్రారంభానికి మోక్షం



ప్రారంభానికి సిద్ధమైన నాగలదిన్నె బ్రిడ్జి

అయిజ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు పులికల్, ఎమ్మిగనూరు గ్రామాల మధ్య నిర్మించిన వంతెనను బుధవారం అధికారికంగా ప్రారంభించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎమ్మిగనూరు నియోజకవర్గం డిప్యూటీ ఇంజినీర్ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం పులికల్ గ్రామం, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా నందవరం మండలం నాగలదిన్నె గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మించేందుకు అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1993లో శంకుస్థాపన చేశారు. అయితే 2003లో నాగలదిన్నె బ్రిడ్జిని ప్రారంభించారు. 2009 అక్టోబర్ 2న వచ్చిన వరద ఉధృతికి బ్రిడ్జి కుప్ప కూలింది. 2013లో రూ.42 కోట్ల నిధులతో నూతన వంతెన నిర్మించేందుకు మళ్లీ శ్రీకారం చుట్టారు. కొన్ని నెలల క్రితం వంతెన పనులు పూర్తయ్యాయి. పది సంవత్సరాల అనంతరం వంతెనను ప్రారంభించనున్నారు.

సెమినార్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద

గద్వాల అర్బన్: దేశంలో, రాష్ట్రంలో మానవ హక్కులకు భంగం వాటిల్లుతుందని అఖిల భారత ప్రజాతంత్ర (ఐద్వా)మహిళా సంఘం జిల్లా కార్యదర్శి నర్మద అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 22న జిల్లా కేంద్రంలోని వాల్మీకి కమిటీ హాల్లో మానవ హక్కుల పరిరక్షణ, మహిళా సాధికారత అనే అంశంపై సెమినార్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సెమినార్‌కు రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి హాజరవుతారని, జిల్లాలోని మహిళలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఐద్వా సంఘం ఉపాధ్యక్షురాలు ఈమేలమ్మ, ఇందిరమ్మ, తిమ్ములమ్మ, శారద ఉన్నారు.

పచ్చిరొట్ట ఎరువులపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని చాగాపురం రైతువేదికలో మంగళవారం పచ్చిరొట్ట ఎరువులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ భరత్ పచ్చిరొట్ట ఎరువుల వల్ల కలిగే లాభాలు, సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట ఎరువులు తక్కువ ఖర్చుతో పంటకు ఎక్కువ పోషకాలు అందిస్తుందన్నారు. జనుము, జీలుగ, పిల్లి పెసర, అలసంద వంటి పైర్లను పొలంలో పెంచి పూత, మొగ్గ దశలోకి రాగానే భూమిలోకి కలియదున్నాలన్నారు. దీనివల్ల మొక్కలకు అవసరమైన నత్రజని వివిధ రూపాలలో నేరుగా అందుతుందన్నారు. భూసారం పెరగడంతో పాటు పంటల దిగుబడి కూడా ఘననీయంగా పెరుగుతుందన్నారు. పర్యావరణానికి ఎలాంటి హాని లేకుండా నేలలో రసాయనిక ఎరువుల వినియోగం కూడా తగ్గుతుందన్నారు. దీంతో రైతులకు పంట పెట్టుబడులు తగ్గడంతో పాటు నాణ్యమైన దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు ఉన్నారు.

సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహాలు పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న మద్దిలేటిగౌడ్

శాంతినగర్: జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని గౌడ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన సర్దార్ పాపన్నగౌడ్ స్టాంపును మంగళవారం గౌడసంఘం నాయకులు విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గౌడసంఘం నాయకులు మద్దిలేటిగౌడ్ మాట్లాడుతూ ఆనాటి రజాకార్లు ఈత, తాటి వనాలపై ఎక్కువగా పన్ను వసూ లు చేయడం, గౌడ కులస్తులను ఇబ్బందులకు గురిచేయడంతో వారి ఆగడాలను సహించని పాపన్నగౌడ్ వందలాదిమందితో సైన్యాలను ఏర్పాటు చేసుకుని రజాకార్లతో యుద్ధం చేసి గోల్కొండ కోటను జయించి రాజ్యాధికారం చేపట్టారని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం సర్దార్ పాపన్నగౌడ్ త్యాగాలను గుర్తించి ఆయన ఫొటోతో స్టాంపు విడుదల చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రతాప్‌గౌడ్, ఉస్సేన్‌గౌడ్, ముండ్లదిన్నె మద్దిలేటిగౌడ్, జయరాములుగౌడ్, తిమ్మప్పగౌడ్ పాల్గొన్నారు.